క్లుప్తంగా

మహిళలకు వరం 'బీమా సఖి'



కోనేరుసెంటర్: మహిళలకు వరం 'బీమా సఖి' అని జీవిత బీమా సంస్థ డెవలప్మెంట్ అధికారి మోహనరావు అన్నారు. మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకమని చెప్పారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో సోమవారం బీమాసఖి పథకంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే 40 కోట్ల బీమా పాలసీలున్న ఏకైక సంస్థ జీవిత బీమా సంస్థ అన్నారు. రోజులో గంటకు ఆరు కోట్ల రూపాయలు చొప్పున కేంద్రానికి ఆదాయం తెచ్చిపెడుతున్న సంస్థ ఎల్ఐసీ అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎస్.ఉష, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెడన ఇన్చార్జి ఈవోపీఆర్డీగా బాలకృష్ణ

పెడన: మచిలీపట్నం ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఎ.బాలకృష్ణ పూర్తి అదనపు బాధ్యతలతో పెడన ఇన్చార్జి ఈవోపీఆర్డీగా సోమవారం బాధ్యతలను స్వీకరించారు. రెండు రోజుల క్రితం జెడ్పీ సీఈవో కన్నమ నాయుడు ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. పెడన మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను పలువురు అభినందించారు.

ఘంటసాల రోడ్డు మరమ్మతులు ప్రారంభం



ఘంటసాల: ఘంటసాల నుంచి కొడాలి వైపు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులు ఎట్టకేలకు సోమవారం ప్రారంభమయ్యాయి. ఘంటసాల సెంటర్ నుంచి పొక్లయిన్ సాయంతో గుంతలుమయంగా మారిన రోడ్డును తొలగించి బ్లేడ్తో సరి చేస్తున్న పనులను అవనిగడ్డ ఆర్ అండ్బీ డీఈ ఎం.రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ రమేష్ మాట్లాడుతూ ప్రధాన రహదారుల మరమ్మతుల్లో భాగంగా ఘంటసాల నుంచి ఘంటసాలపాలెం వరకు ఆర్అండ్బీ రోడ్డుకు రూ.40 లక్షల అంచనాతో ప్రతిపాదనలు పంపారన్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రావడంతో రోడ్డు మరమ్మతులు ప్రారంభించినట్లు చెప్పారు. కొడాలి – శ్రీకాకుళం, ఘంటసాలపాలెం – కొడాలి వరకు రహదారి మరమ్మతులు జరుగుతున్నాయని, రామానగరం – ఘంటసాల రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు డీఈ రమేష్ వివరించారు. సకాలంలోనే రోడ్డు పనులు పూర్తి చేస్తామని, ఆయా రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మించడానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు డీఈ తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



మచిలీపట్నంటౌన్: వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని జాగ్రత్తపడాలని జిల్లా ప్రజా రవాణాధికారి వాణిశ్రీ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా ప్రజా రవాణా రంగంలో డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి రోడ్డు ప్రమాదం జరగకుండా ఆర్టీసీ బస్సులను గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఆర్టీసీలో పని చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్వైజర్లకు ఆమె వివరించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి శ్రీనివాస నాయక్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిద్దఖీ, ట్రాఫిక్ సీఐ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్ తప్పనిసరి



కోడూరు: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని ఎస్ఐ చాణిక్య తెలిపారు. సోమవారం పోలీస్శాఖ ఆధ్వర్యాన కోడూరు ప్రధాన సెంటర్లో 'నో హెల్మెట్ నో ఎంట్రీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ ధరించడంతో అనుకోకుండా జరిగే ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని ఎస్ఐ చెప్పారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల ఆర్సీ, ఇన్సూరెన్స్ పత్రాలను తనిఖీ చేశారు. పత్రాలు సరిగా లేని వాహనచోదకులకు జరిమానా విధించారు. సిబ్బంది పాల్గొన్నారు.

బాబోయ్ దోమలు!

- బందరు మండలంపై దండెత్తుతున్న దోమలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- బెంబేలెత్తుతున్న ప్రజలు





పాతేపల్లి కచ్చా డ్రెయిన్లో మురుగునీరు

కోనేరుసెంటర్ : మచిలీపట్నం రూరల్ మండలంలోని 34 గ్రామాల్లో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఈ గ్రామాల్లో సుమారు లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. ప్రజారోగ్యంపై దోమకాటు వేస్తోంది. పగలు, రాత్రి తేడా లేకుండా దాడి చేస్తూ మండల ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దోమల తాకిడికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీటి దెబ్బకు కంటిపై కునుకు కరవవుతోందని ఆందోళన చెందుతున్నారు. దోమలతో ఎలాంటి వ్యాధులు ప్రబలుతాయో అని ప్రజలు మధనపడుతున్నారు. దోమల నివారణకు ఇళ్లల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నా ప్రయోజనం ఉండటంలేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

మండలంలో పారిశుద్ధ్యం పడకేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు. గృహాల మధ్య తిష్టవేసిన మురుగునీరు, చెత్తాచెదారం కారణంగా దోమలు వ్యాపిస్తున్నాయని వాపోతున్నారు. గ్రామాల్లో మురుగునీరు పారడానికి డ్రైనేజీ సౌకర్యం లేక ఇళ్లలో వాడుక నీటితో పాటు వర్షం నీరు పల్లపు ప్రాంతాల్లో నెలల తరబడి తిష్టవేస్తుంది. దోమలు మురుగునీటిని ఆవాసాలుగా చేసుకుని సంతానోత్పత్తి చెందుతున్నాయి. ఉన్న కచ్చా డ్రైన్లు పూడుకుపోవటంతో గ్రామాల్లో మురుగు నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. దీంతో పల్లె ప్రజలకు దోమల తాకిడి తప్పడం లేదు.

ప్రజల ఆందోళన

గ్రామాల్లో రోజురోజుకూ పెరిగిపోతున్న దోమల తాకిడికి పల్లె ప్రజలు అనేక మంది ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పలువురు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతో మంచాన పడి చికిత్స చేయించుకుంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా విజృంభిస్తున్న దోమలు జనం రక్తాన్ని పీల్చటంతో పాటు అనారోగ్యం పాలు జేస్తున్నాయంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల కారణంగా కంటి నిండా నిద్ర ఉండటంలేదని వాపోతున్నారు.

34 పంచాయతీల్లో దయనీయ పరిస్థితి

మండలంలో 34 పంచాయతీలుగా ఉండగా అన్నింటిలోనూ ఇదే దయనీయ పరిస్థితి నెలకొందని మండల ప్రజలు వాపోతున్నారు. దోమల తాకిడికి సంబంధించి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. దోమల నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండలంలో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడగా దోమలు నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

కోడూరు: వసంత పంచమి వేడుకలను సోమవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మండలంలోని కనకదుర్గమ్మ ఆలయంలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులతో సామూహిక కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం ఆధ్వర్యంలో పంచమి వేడుకలు జరిగాయి. సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేసి చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. 20మంది చిన్నారులకు పలకలు, పుస్తకాలను నాగభూషణం ఉచితంగా పంపిణీ చేశారు. కోడూరు జీవీ అకాడమీలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అకాడమీ చైర్మన్ వెంపటి గోపీచంద్ దంపతులు సరస్వతి హోమాన్ని చేసి, చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

గూడూరు: కంకటావ ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నవీన్బాబు ఆధ్వర్యాన కార్యక్రమంలో పాఠశాల పరిధిలో ఐదేళ్లు నిండిన చిన్నారులకు జెడ్పీ హైస్కూలు హిందీ ఉపాధ్యాయిని మాదిరెడ్డి సునీత ఓనమాలు దిద్దించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు స్వాతి, అరుణ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉల్లిపాలెంలో చిన్నారులకు పలకలను అందిస్తున్న ఉపాధ్యాయుడు నాగభూషణం



చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న దృశ్యం

హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాలి



కోటేశ్వరరావును అభినందిస్తున్న మారుతీరామ్, కనకదుర్గ తదితరులు

పెడన: హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని హిందూ చైతన్యవేదిక ప్రాంత సహా సంయోజక్ అంబటి మారుతీరామ్ అన్నారు. స్థానిక శ్రీగంగాపార్వతీ సమేత ఆగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యాన కృష్ణాజిల్లా హిందూ చైతన్య వేదిక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మారుతీరామ్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికే హిందూ ఐక్యవేదిక ఆవిర్భవించిందని స్పష్టం చేశారు. హిందూ దేవాలయాల భూములు అన్యాక్రాంతమైనా ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం చాలా దారుణమని వ్యాఖ్యానించారు. ప్రాంత ఆర్థి ప్రముఖ్, ప్రచార విభాగ ప్రముఖ్ కనకదుర్గ మాట్లాడుతూ హిందూ ధర్మానికి హాని చేస్తున్న, గోవధ చేస్తున్న, దేవాలయ భూములు ఆక్రమణలకు గురైనా హిందూ చైతన్య వేదిక కార్యకర్తలు ముందుండి పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక నేతలు అర్జునరావు, పి.సుజయ్కుమార్, ఎస్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హిందూ చైతన్య వేదిక కృష్ణాజిల్లా సంయోజక్గా నాదేళ్ల కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'లక్ష డప్పులు' వాల్పోస్టర్ ఆవిష్కరణ



లక్ష డప్పులు- వేల గొంతులు వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మార్పీస్ నాయకులు

మచిలీపట్నంటౌన్: ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 7న హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న లక్ష డప్పులు – వేల గొంతుల కార్యక్రమాన్ని మాదిగలు, ఎస్సీ వర్గీకరణను సమర్థించే ప్రతిఒక్కరూ జయప్రదం చేయాలని పలువురు ఎమ్మార్పీస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమ వాల్పోస్టర్లను ఆ సంఘ నాయకులు సోమవారం మల్కాపట్నం గుప్తా సెంటర్లోని జగ్జీవన్రామ్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డప్పులతో హైదరాబాద్ కదలి రావాలని, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్లో చేరి చరిత్ర సృష్టించేలా చేయాలన్నారు. కృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించిన కేంద్రం ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి కృష్ణ జిల్లా ఉద్యోగ సంఘ నాయకులు కొమ్ము ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ఎస్సీల్లో ఉన్న 59 ఉప కులాలకు సమ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నేతలు జయరాజ్ మాదిగ, కె.బసవ మాదిగ, ఎంఎస్పీ కృష్ణా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. నవీన్ మాదిగ, మాజీ కౌన్సిలర్ శరత్ కుమార్, జూనపూడి నిరంజన్,కో ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, ఉడుముల బుజ్జి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

బంటుమిల్లి: ప్రజల రక్షణ కోసం ప్రభుత్వాలు తయారు చేస్తున్న చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఎస్ఐ గణేష్కుమార్ అన్నారు. ములపర్రు పంచాయితీ శివారు దళితవాడలో సోమవారం రాత్రి అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ పోక్సో, రోడ్డు భద్రత, మహిళలు, మైనర్లపై వేధింపులు తదితర చట్టాలను వివరించారు. ఇవి నమోదైతే ఎదురయ్యే ఇబ్బందులను తెలిపారు. ఆలయాలు, మందిరాలు, చర్చిలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఘటనలు జరిగినా గుర్తించడం తేలికవుతుందని ఆయన చెప్పారు. పలువురు స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వనమలమ్మ ఆలయ, విగ్రహాల పునః ప్రతిష్ట



పునఃప్రతిష్ట కార్యక్రమంలో పేర్నికిట్టు, చిత్రంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని నిజాంపేటలోని వేంచేసి ఉన్న శ్రీ కల్యాణ సుందరేశ్వర సంహిత శ్రీ విజయ వనమలమ్మ అమ్మవారి, పరివార దేవతల, దేవాలయం ప్రతిష్ట సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతోఅంగ రంగ వైభవంగా జరిగింది. దాదాపు రూ.2.5 కోట్లతో కొండరాయితో పునఃనిర్మించిన ఆలయం, అమ్మవారి విగ్రహంతో పాటు పరివార దేవాతామూర్తులైన శ్రీ సంకటహర మహాగణపతి, శ్రీ శక్తిధర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి రాతి విగ్రహాలను, ఏకశిలా ధ్వజ స్తంభాన్ని పునః ప్రతిష్ఠించారు. కార్యక్రమాన్ని రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి బ్రహ్మత్వంలో నిర్వహించగా తుని మఠాధిపతి సచ్చిదానంద సరస్వతి హాజరై పర్యవేక్షించారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్, నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి– మాజీ కౌన్సిలర్ శీలం మారుతీరావు(బాబ్జీ) దంపతులు, కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాన్ని ఆలయ భక్తబృందం ప్రతినిధులు మిరియాల రామకృష్ణ, నరహరిశెట్టి కనక దుర్గా వర ప్రసాద్, విన్నకోట వన దేవి, విన్నకోట వనప్రభాకర్, శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళం గ్రామంలో కృష్ణానది కరకట్టపై ఉన్న గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పరివార దేవతల, దేవాలయ 26వ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు చుండూరు నాగ భాస్కరాచార్యులు, చుండూరు నాగ హేమంతాచార్యులు అర్చకత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం మచిలీపట్నంకు చెందిన చిలకలపూడి శంకరరావు, వరలక్ష్మి సమక్షంలో భక్త జనసందోహం మధ్య మేళతాళాలు, వేదమంత్రోచ్చరణలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం 2500 మందికి అన్నసమారాధన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● మంచు తడిపింది.. గూడు మెరిసింది



ఆహారం కోసం వలవేస్తే మంచుచినుకులు పడ్డాయేంట్రా బాబూ అనుకుంటూ ఆ సాలీడు గమ్మునుండిపోయినట్లుంది కదా ఈ చిత్రం చూస్తే. సాలీడు ఎంతో కళాత్మకంగా అల్లుకున్న అందమైన గూడు మంచు చినుకుల జడివానలో తడిసి ముద్దయి మెరిసింది. కృత్తివెన్ను మండలం యండపల్లిలో సోమవారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' బంధించింది. –కృత్తివెన్ను

బందరులో కొండచిలువ కలకలం

నగర శివారు చిట్టి బొంబాయి కాలువ వద్ద మూడు రోజులుగా సంచరిస్తున్నవైనం



మచిలీపట్నంటౌన్: నగర పరిధిలోని 22వ డివిజన్ చిట్టి బొంబాయి కాలువ వద్ద కొండచిలువ సంచారం కలకలం సృష్టిస్తోంది. కొండ చిలువ సంచారంతో ఆ ప్రాంత ప్రజలు కంటిపై కునుకు లేకుండా భయాందోళనకు గురవుతున్నారు. ఆ ప్రాంతంలోని చెట్టుపై ఎక్కడం కిందకు దిగి సంచరిస్తుండడంతో భయపడుతున్నారు. దాదాపు తొమ్మిది అడుగుల పొడవుతో లావుగా ఉన్న ఈ కొండచిలువను అటవీ శాఖ అధికారులు వచ్చి పట్టు పట్టుకోవాలని స్థానికుల కోరుతున్నారు. ఇళ్లలోకి వస్తుందేమోనని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

శేషవాహనంపై కార్తికేయుని గ్రామోత్సవం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి శేషవాహనంపై సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం ఐదు గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్యహోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు చేశారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక పల్లకీలో ఆలయ ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం శేషవాహనంపై ఉభయ దేవేరులతో రావివారిపాలెం వరకు ఊరేగింపు జరిగింది. ఆలయ ప్రాంగణలో గురువు ఆదిశేషు ఏర్పాటు చేసిన మురళీకోలాటం భక్తులను అలరించింది.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పెడన: పెయింటింగ్ పనుల నిమిత్తం పొరుగు జిల్లా నుంచి వచ్చి ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం మృతి చెందిన ఘటనపై పెడన పీఎస్లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా పెదపూడి మండలం కైకవోలు గ్రామానికి చెందిన పెరుగుల అరవింద్కుమార్(19) పెయింటింగ్ పనుల నిమిత్తం పెడన మండలం చేవేంద్రలోని వేణుగోపాలస్వామి ఆలయానికి మేస్త్రీతో పాటు కొందరు వచ్చారు. వీరిలో అరవింద్కుమార్ గత నెల 29న పెయింటింగ్ వేస్తూ పై నుంచి కిందపడ్డాడు. హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి, అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఏఎస్ఐ సురేష్కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

బంటుమిల్లి: పెడన నియోజకవర్గ పరిధిలో ఓఎన్జీసీ ఆధ్వర్యాన చేపట్టనున్న తవ్వకాలపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ మంగళవారం నిర్వహించనున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏపీ పొల్యూషన్ బోర్డు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారులు రైతుల వద్ద నుంచి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకోనున్నారు.

నివాళి



కోడూరు: వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు యలవర్తి నాగేంద్రుడు సతీమణి లక్ష్మీనాంచారమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. నాంచారమ్మ మృతివార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబు వి.కొత్తపాలెం వచ్చి ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకొని సానుభూతి తెలిపారు. సర్పంచి యలవర్తి నాంచారయ్య, స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'గ్రిగ్ మెమోరియల్' పోటీలు

గోగినేనిపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం నుంచి 84వ గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ జోన్ క్రీడలు, ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం టి.వి.జి.రావు సోమవారం తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ గురువారం వరకు పోటీలు జరుగుతాయన్నారు.

సబ్జోన్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



నాగాయలంక: కృష్ణా జిల్లా 84వ వార్షిక సెకండరీ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన అవనిగడ్డ సబ్జోన్ బాలికల ఆటల పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ బాలికలు విజయభేరి మోగించారు. కోడూరు మండలం లింగారెడ్డిపాలెంలో జనవరి31, ఈనెల1వ తేదీన నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల బాలికలు సాఫ్ట్బాల్(సీనియర్స్), బాడ్మింటన్(జూనియర్స్) క్రీడా పోటీల్లో ప్రథమ స్థానం సాధించారని పాఠశాల హెచ్ఎం పీవీఎస్వీ ప్రసాదరావు సోమవారం తెలిపారు. ఈ రెండు జట్ల బాలికలు 11,12,13 తేదీల్లో అవనిగడ్డ సెంట్రల్ జోన్లో ఆడతారు. శిక్షణ ఇచ్చిన పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, క్రీడా బాలికలను ఎస్ఎంసి చైర్మన్, వైస్చైర్మన్ వక్కపట్ల లీలామారుతి, దాసరి శేఖర్బాబు పాఠశాల విద్యాకుటుంబం అభినందించారు.

ఆలయానికి రూ.70వేల విరాళం

పామర్రు: కొండిపర్రు రోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కురుమద్దాలి గ్రామస్తులు వేములపల్లి నారాయణరావు జ్ఞాపకార్థం కుమారుడు వీవీఎస్ ప్రసాద్ రూ.70వేల విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్రాజా చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు.

సులభ పద్ధతిలో బోధన

పమిడిముక్కల: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. పెనుమత్స ప్రాథమికోన్నత పాఠశాల్లో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనాన్ని రుచిగా చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం

బంటుమిల్లి: అర్తమూరు పంచాయితీ శివారు సాయినగర్ గ్రామంలో కొలువై ఉన్న శ్రీ షిర్డీ సాయి మందిర 5వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాయినామ సంకీర్తన చేశారు. సాయి ప్రధాన విగ్రహానికి, ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకాలు చేశారు. మందిర ట్రస్టీ సూర్యచంద్రరావు దంపతులు హోమాలను, పూజలు నిర్వహించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లేశ్వరం డీసీ చైర్మన్ బి.కాశి, భక్తులు పాల్గొన్నారు.